క్లుప్తంగా

భగత్‌సింగ్ చూపిన మార్గంలో పయనిద్దాం



రేపల్లె రూరల్: యువతలో దేశభక్తి రగిలించేలా చైతన్య పరిచి దేశ స్వాతంత్య్ర సిద్ధికై నిర్విరామ కృషి చేసి చిరుప్రాయంలోనే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ సేవలు అజరామరమని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాలు, విద్యార్థి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ స్వాతంత్య్రం కోసం చిన్న వయసులోనే నరనరాల్లో దేశభక్తిని నింపుకున్న మహనీయుడని వక్తలు కొనియాడారు. యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, వై నవీన్, బి ఆగస్టిన్, అరుణ్, వాసు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం



బాపట్ల: ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలకు ఉచిత ఉపకరణాలను నిర్ధారణ శిబిరంలో అందిస్తున్నామని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎంవీ.సుధాకర్ తెలిపారు.సమగ్ర శిక్ష ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం శనివారం నిర్వహించారు.70 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న, నేత్ర వైద్యులు డాక్టరు లాస్య, నివేదిత, నాగ కోటేశ్వరరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

నోడల్ అధికారి వైపీ రెడ్డి



బాపట్ల: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నోడల్ ఆఫీసర్ వైపీ.రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై శనివారం అవగాహన చేపట్టారు. ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకట్రావు, ఏ.గోపిరెడ్డి, జి.స్వాతి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల మస్టరు పరిశీలన



వరహాపురం(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పని కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల మస్టర్లను శనివారం పరిశీలించారు. కూలీలు ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కర్లపాలెం: సబ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పే నిమిత్తం కర్లపాలెం మండల పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మల్లెల కుమార్ శనివారం తెలిపారు. కర్లపాలెం మండలంలో నెల కొన్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.75లక్షలు విలువ గల 8 ఏఎం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళన సభ

పోతుమర్రు(వేమూరు): వేమూరు మండలంలోని పోతుమర్రు గ్రామంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

కనుల పండువగా మల్లన్న బ్రహ్మోత్సవాలు

- నేడు స్వామివారి దివ్య రథోత్సవం
- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం బింది తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలను శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. రాత్రి టీటీడీ సహకారంతో శ్రీ మల్లేశ్వర భజన భక్త సమాజం, శ్రీనివాస మహిళా సమాజం నిర్వాహకులు కొతరపు గోపాల కృష్ణయ్య, కుక్కల రాజ్యలక్ష్మి బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఆలయంలో జగజ్యోతి, ఎదురుకోల మహోత్సవం వైభవంగా జరిగింది. అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం నిర్వాహకులు స్వామి వారి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పించారు. స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో కొతరపు పిచ్చయ్యశాస్త్రి-విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మూర్తులైన స్వామి వార్లను గ్రామోత్సవం కావించారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవం ఆదివారం సాయంత్రం జరగనున్నది. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు పర్యవేక్షించారు.

విశ్వనాథపల్లి తిరునాళ్లకు తరలిన భక్తజనం

ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని విశ్వనాథపల్లి తిరునాళ్ల మహోత్సవానికి భట్టిప్రోలు నుంచి ప్రత్యేకంగా టైరుబళ్లపై గూడును ఏర్పాటు చేసుకుని భక్తులు తరలి వెళ్లారు. ప్రతి ఏటా గ్రామస్తులు అధిక సంఖ్యలో ఈ తిరునాళ్లకు వెళ్లి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.



ప్రత్యేక అలంకారంలో మల్లేశ్వర స్వామి



శ్రీ భ్రమరాంబ అమ్మవారు



జగజ్యోతిలో నెయ్యి సమర్పిస్తున్న మహిళలు

చినపరిమిలో...

చుండూరు మండలం చినపరిమి గ్రామంలో కొలువైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి నవాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వార్లకు ఉదయం, సాయంత్రం నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాలు శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి వార్ల ఎదురుకోల ఉత్సవం, అనంతరం దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవం ఆదివారం జరగనుంది. కల్యాణ దాతగా కొల్లిపర రామేశ్వరలింగం వ్యవహరించారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోకరెడ్డి పర్యవేక్షించారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

కొల్లూరు : దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా ఉపయోగ కార్యక్రమాలలో పాలు పంచుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, రైతు సంఘం జిల్లా నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్యలు కోరారు. శనివారం కొల్లూరు బీఆర్‌కే శాస్త్రి మెమోరియల్ ఐటీఐ కళాశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో మగ్గిపోతున్న భారతీయులకు స్వేచ్ఛను అందించేందుకు ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్ చిరస్మరణీయుడని అన్నారు. తొలుత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్ర పటాలకు కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణశాస్త్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు బొనిగల సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు రాజేష్, రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు అభిషేక్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్‌కు నివాళి

భట్టిప్రోలు: బ్రిటీష్ పాలకుల దాస్య శృంఖలాల నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు 23 ఏళ్ల ప్రాయంలోనే ప్రాణ త్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్ అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలులోని టీఎంరావు హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు వేశారు. భగత్‌సింగ్ అడుగు జాడల్లో యువత నడవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు

విప్లవ వీర కిశోరం భగత్‌సింగ్

బాపట్ల: భగత్‌సింగ్ పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడయ్యారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పీసీ సాయిబాబు పేర్కొన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ ప్రజల్లో తిరుగుబాటు స్ఫూహను కలిగించారని గుర్తు చేశారు. విప్లవ మార్గాన్ని ఎంచుకొని అలుపెరగని పోరాటం చేశారన్నారు. న్యాయవాది జమ్రుద్ బాషా, రామకోటేశ్వరరావు, సురేష్, దాసరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘుపతి

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ పరిధిలోని కొత్త ఇస్లాంపేట, పాత ఇస్లాంపేట గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు శనివారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి నివాసంలో ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కే ఆసిఫ్ అలీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోన రఘుపతి వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని కోరారు. సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు అండగా నిలిచాయని రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా కోన రఘుపతిని గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారంతా తెలిపారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో సుభానీ, గౌస్ భాషా, షేక్ మీరా, షేక్ రజిముర్, మూసా, సాధిక్, గౌస్, రోషన్, సర్దార్, సిరాజ్, ఉమర్, నాగూర్, కరీం, ముఖీర్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, మండల కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు తాజ్ పాల్గొన్నారు.

మూల్పూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు శనివారం కూచిపూడి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లోనూ తెలుగు దేశం పార్టీకి చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వీరంతా పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూల్పూరు సామియేలు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోన రఘుపతితో ఎంవీ రాజుపాలెం ముస్లిం సోదరులు



కూచిపూడి పార్టీ కార్యాలయంలో చేరికలు

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు

కొల్లూరు : అమృతలూరు మండలం కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ కార్యాలయంలో వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో కొల్లూరు ఎస్సీ ప్రాంతానికి చెందిన సుమారు 20 కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వరికూటి అశోక్‌బాబు వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద వర్గాల కోసం పెత్తందారి వ్యవస్థతో పోరాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి అవినీతికి మూలమైన టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. స్థానిక నాయకులు కార్యకర్తలతో కలసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన సూచించారు.

రథోత్సవ నిర్వహణకు ప్రత్యేక భద్రతా చర్యలు

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 24న నిర్వహించే దివ్య రథోత్సవానికి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన శ్రీమల్లేశ్వర స్వామి వారిని వేమూరు సీఐ రామకృష్ణ, భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావులతో కలసి దర్శించుకున్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ చుండూరు, రేపల్లె, వేమూరు సర్కిల్ పరిధిలోని 7గురు ఎస్ఐలు, 50 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. రథం వెళ్లేటప్పుడు రోప్ పార్టీని ఏర్పాటు చేసి రథంపై నలుగురు వ్యక్తులకు మించి ఉండకుండా చూస్తామన్నారు. రథం ముందు 15 అడుగుల దూరం వరకు భక్తులు ఉండకుండా తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాలయంలో స్వామి వార్ల దర్శనార్థం క్యూలైన్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. రథోత్సవానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండే విధంగా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, టెలికామ్, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. వీరి వెంట దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, వంశ పారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ రామకృష్ణ

వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు వేద్దాం

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి అవుతారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. భట్టిప్రోలు మండలం గొరిగపూడి పంచాయతీ పరిధిలోని వరికూటిపాలెం, ఓలేరులో గౌడ, యాదవ సంఘీయులతో శనివారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన అజెండా అని అన్నారు. ప్రజల బాగోగుల కోసం పరితపించే వారిలో ముందు వరుసలో ఆయన ఉంటారన్నారు. ఆయా గ్రామస్తులు అశోక్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ గరిగ పాటి మల్లిక, ఎంపీటీసీ సభ్యులు వరికూటి పున్నయ్య, నన్నెపాముల చంటి, పట్టాభి రామయ్య, వెంకటేశ్వరరావు, నాగరాజు, గంటా కృష్ణ, గాదె జగన్‌మోహన్‌రావు, పడమటి శ్రీనివాసరావు, కుందేటి రమేష్, కుక్కల భూషణరావు, తదితరులు పాల్గొన్నారు.



ఓలేరులో గౌడ సంఘీయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

ఉత్సవాల నిర్వహణకు సహకరించండి

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

కొల్లూరు : తిరునాళ్లలో ఘర్షణలు నిలువరించి శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. మండలంలోని దోనేపూడి లక్ష్మీ తిరుపతమ్మ తల్లి తిరునాళ్ల, పెసర్లంకలోని నాంచారమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు ఆదివారం జరగనున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండు తిరునాళ్లల్లో గతంలో జరిగిన ఘర్షణల కారణంగా పలువురు గాయాల బారిన పడిన సందర్భాలు ఉండటంతో బందోబస్తుకు సిబ్బందిని పెంచినట్లు తెలిపారు. 97 మంది సిబ్బంది, ఎస్ఐలు, సీఐలతో తిరునాళ్లలు శాంతియుతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. దోనేపూడి తిరునాళ్లకు ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కేటాయించిన సిబ్బందిలో అధిక శాతం దోనేపూడి తిరునాళ్లకు మిగిలిన సిబ్బంది పెసర్లంక తిరునాళ్లకు కేటాయించనున్నామన్నారు. తిరునాళ్ల సమయంలో కేటాయించిన సిబ్బంది తమ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో గుడి వద్దకు వచ్చే వాహనాలతో పాటు వ్యక్తిగతంగా ఏ ఒక్కరూ ఆయా రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీలు ప్రదర్శించకూడదని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి గొడవలు తలెత్తకుండా కొంతమంది యువకులను ముందస్తుగా బైండోవర్ చేసుకుంటున్నామన్నారు.



టి. మురళీకృష్ణ

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

నిజాంపట్నం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, వాసవీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నిజాంపట్నంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కాశేపల్లి గౌరీశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశేపల్లి బసవయ్య జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్యశిబిరంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

ట్రైనీ డీఎస్పీ పి.గీత

ప్రత్తిపాడు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసుశాఖ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించిందని ట్రైనీ డీఎస్పీ పి.గీత అన్నారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, గనికపూడి గ్రామాల్లో శనివారం సాయుధ పోలీసు బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ గీత, ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావులు ప్రత్యేక బలగాలతో కలిసి గ్రామాల్లో కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

లోకాయుక్త ఫిర్యాదు మేరకు విచారణ

పిట్టలవానిపాలెం: మండలంలోని భవనంవారిపాలెం గ్రామ సచివాలయంలో మండల విస్తరణాధికారి కె.పద్మజ లోకాయుక్త ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. భవనంవారిపాలెం శివారు చోడిపాలెం గ్రామంలోని చేపల చెరువును వేలం నిర్వహించకుండా డబ్బులు తీసుకుని ఆ డబ్బులు పంచాయతీ నిధులకు జమచేయకుండా స్వాహా చేశారని మాజీ సర్పంచ్ ఆనందరావు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అప్‌సెట్ ప్రైస్ లేకుండా రూ.25 వేలు తీసుకుని చెరువును పట్టించారని ఆరోపించారు. గతంలో ఈ విషయంపై స్థానిక ఎంపీడీఓ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని అయితే వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఓ వ్యక్తి చేపల చెరువు పట్టుకున్నాడని అందుకు ప్రతిఫలంగా రూ.25 వేలను గ్రామ కార్యదర్శికి ఇచ్చినట్లుగా చెప్పిన పూర్తి ఆధారాలను లోకాయుక్తకు అందజేసినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని భవనంవారిపాలెం గ్రామ పంచాయతీ ఆరో వార్డు సభ్యులు మోదుగుల శంకర్‌రెడ్డి స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఈఓపీఆర్డీ పద్మజ తెలిపారు.



గ్రామ సచివాలయంలో విచారణ చేపడుతున్న అధికారులు

జెండా వివాదంపై ఘర్షణ

ఇరువురిపై కేసు నమోదు

కొల్లూరు : రాజకీయ పార్టీకి చెందిన ఓ జెండా వ్యవహారంలో జరిగిన వివాదంలో ఇరువురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు శనివారం రాత్రి కొల్లూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కిష్కిందపాలెంకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు పోలిమట్ల ఆనంద్ గృహంపై రాజకీయపార్టీకి చెందిన జెండా ఉందని అదే గ్రామానికి చెందిన కొల్లి వెంకటేశ్వరరావు శనివారం సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదుపై స్పందించిన సచివాలయ సిబ్బంది జెండాను తొలగించాలని ఎంపీటీసీ సభ్యుడ్ని కోరారు. దీనిపై ఎంపీటీసీ సభ్యుడు ఫిర్యాదు చేసిన వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి తనపై ఫిర్యాదు చేయడంపై ప్రశ్నించడంతో ఫోన్‌లో ఆనంద్‌ను దుర్భాషలాడాడు. వేరే ప్రాంతంలో ఉన్న ఆనంద్ గ్రామంలోకి వచ్చి పెద్ద మనుషులను తీసుకొని వెంకటేశ్వరరావుకు చెందిన కోళ్ల పెంపకం చేపట్టే ప్రదేశానికి వెళ్లి తనను ఫోన్‌లో దూషించడంపై ప్రశ్నించాడు. దీనితో వెంకటేశ్వరరావు నీకు సమాధానం చెప్పాల్సినన అవసరం లేదని అక్కడ నుంచి వెళ్లాలని అన్నప్పటికీ వెళ్లకపోవడంతో వెంకటేశ్వరరావు ఆనంద్‌పై చేయి చేసుకున్నాడు. కులం పేరుతో దూషిస్తూ పలుగుతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ కొల్లూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మరోపక్క తాను కోళ్ల పెంపకం చేపట్టే ప్రాంతానికి వచ్చిన ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ మరో ముగ్గురు వ్యక్తులతో కలసి దాడిచేసి గాయపర్చాడని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రేపల్లె రూరల్: పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలోని 10వ వార్డులో చోటు చేసుకుంది. ఎస్ఐ నజీర్‌బేగ్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో 10వ వార్డులోని సింగం బసవపున్నయ్య వీధిలో ఒక గృహంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడులలో పేకాట ఆడుతున్న 14 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.63,910 నగదు, 14 సెల్‌ఫోన్‌లు, 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో గత వారంరోజుల నుంచి జరుగుతున్న విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్.గంగాధర్‌కుమార్ మాట్లాడుతూ యువత కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధి చేపట్టేందుకు వీలుకలుగుతుందన్నారు. పండ్లు, కూరగాయలతో ఇంటి దగ్గరే నాణ్యమైన పదార్థాలతో ఆరోగ్యం మెరుగు పరుచుకోవచ్చని తద్వారా ఉపాధిని పొందవచ్చన్నారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ యువతకోసం ఇంకా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను కేవీకే సమన్వయంతో చేపట్టటం జరుగుతుందన్నారు. స్వయం ఉపాధి కోసం యువత శిక్షణ పొంది స్వయంగా వ్యాపారాలు చేసుకునేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సమేతి ఏడీఏ పుణ్యవతి కూరగాయలు, పండ్లతో ఎన్నోరకాల విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసే విధానాలను వివరించారు. శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దీప, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.